రీసర్వేకు రిపీట్ బెడద

మొదటిపేజీ తరువాయి...

3 పద్ధతుల్లో సర్వేను మమ అనిపించింది. సర్వేకు సంబంధించి ఎలాంటి ప్రామాణిక పద్ధతులను పాటించలేదు. ఎన్యుమరేటర్లకే పూర్తి స్వేచ్ఛను ఇచ్చింది. కానీ వివరాల నమోదుకు ప్రత్యేకంగా ఎలాంటి యాప్‌ను, సాఫ్ట్‌వేర్‌ను అందుబాటులోకి తీసుకురాలేదు. మాన్యువల్‌గా డాటా సేకరించి, ఆ వివరాలను ఆపై ఎంట్రీ చేశారు. ఆధార్, రేషన్‌కార్డు తదితర వివరాలను ఐచ్ఛికంగానే ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం నమోదు చేసుకున్న వారు ఎవరు? వివరాలు నమోదు చేసుకోని వారు ఎవరు? అనేది తేల్చిచెప్పడం అసాధ్యమని అధికారులే వెల్లడిస్తున్నారు. ఇదిలా ఉంటే ఇప్పటికే వివరాలను నమోదు చేసుకున్న వారు మళ్లీ వివరాలను నమోదు చేసుకుంటే గుర్తించడం కష్టమనే భావన వెల్లువెత్తుతున్నది. దీంతో రిపిటేషన్స్ పెరిగే అవకాశమున్నదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గణాంకాలన్నీ తారుమారు..?

రాష్ట్రవ్యాప్తంగా 3.70 కోట్ల జనాభా ఉండగా, అందులో 16 లక్షల (3.1శాతం) జనాభా వివరాలను నమోదు చేయించుకోలేదని ప్రభుత్వం తెలిపింది. వారి కోసం ప్రభుత్వం మరోసారి అవకాశాన్ని కల్పిస్తున్నట్టు తెలిపింది. గతంలో నిర్వహించిన సర్వేలు, వివిధ జాతీయస్థాయి విభాగాలు వెల్లడించిన గణాంకాలతో పోల్చితే తాజా సర్వే గణాంకాల్లో భారీ వ్యత్యాసమున్నది. అరకోటి కిపైగానే జనాభా సర్వేలో పాల్గొనలేదని తెలుస్తున్నది. ఇప్పుడు వారంతా సర్వేలో పాల్గొంటే గణాంకాలన్నీ తారుమారయ్యే పరిస్థితి ఉంటుందని బీసీ నేతలు, మేధావులు వెల్లడిస్తున్నారు. దీనిపై ప్రభుత్వం మొండిగా ముందుకెళ్తున్నదని మండిపడుతున్నారు. ఇప్పటికీ ప్రత్యేకంగా సాఫ్ట్‌వేర్‌ను, ఓ యాప్‌ను రూపొందించలేదని గుర్తుచేస్తున్నారు. ఇప్పటికే సేకరించిన డేటాను క్రోడీకరించి సాఫ్ట్‌వేర్‌ను రూపొందించాలని తద్వారా రిపిటేషన్లను నివారించవచ్చని తెలుపుతున్నారు. లేదంటే ఒక్కరే పలుచోట్ల, పలుమార్లు వివరాలను ఎంట్రీ చేయించుకునే అవకాశం ఏర్పడుతుందని, ఫలితంగా డాటానే ప్రామాణికత లేకుండా పోతుందని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా నిపుణుల కమిటీని ఏర్పాటుచేయాలని, లోపాలు లేకుండా రీసర్వేను విజయవంతంగా పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. కానీ ప్రభుత్వం మళ్లీ అశాస్త్రీయ పద్ధతుల్లోనే సర్వేను చేస్తే మళ్లీ అసమగ్ర వివరాలే వస్తాయి తప్ప.. సమగ్ర వివరాలు రాబోవని తేల్చిచెబుతున్నారు.

- మల్లన్న సాగర్ నీటి ఉధృతికి ఉపకాల్వకు గండి

సిద్దిపేట జిల్లాలోని మల్లన్నసాగర్ వద్ద ఒక్కసారిగా గేట్లు ఎత్తడంతో 4ఎల్ డిస్ట్రిబ్యూటర్ ప్రధాన కాల్వల నుంచి నీటి ప్రవాహ ఉధృతికి శుక్రవారం ఉదయం దుబ్బాక-మల్లాయిపల్లి ఉప కాల్వకు గండిపడింది. దీంతో పక్కనే ఉన్న రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. పక్కనున్న పొలాల్లోకి నీరు ప్రవహించడంతో రైతుల పంటలు నీట మునిగాయి. -దుబ్బాక

42% ఇచ్చేదాకా కాంగ్రెస్‌ను వదలం

- జీవో నంబర్ 26ను ఎందుకు తుంగలో తొక్కారు?
- ఇప్పుడు చేసిన సర్వే న్యాయస్థానాల్లో నిలబడదు
- అసమగ్ర సర్వే చేసి బీసీలకు అన్యాయం చేస్తే ఊరుకోం
- మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆగ్రహం

ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రకటించినట్టుగా బీసీలకు 42% రిజర్వేషన్లు ఇచ్చేదాకా కాంగ్రెస్‌ను వదలబోమని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ స్పష్టం చేశారు. కరీంనగర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ డిక్లరేషన్ పేరిట కాంగ్రెస్ పార్టీ ఓట్లు దండుకొని, అధికారంలోకి వచ్చాక మోసగించిందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం చేయించిన కులగణన సర్వే అసమగ్రంగా, అశాస్త్రీయంగా, కాకి లెక్కలుగా ఉందని మండిపడ్డారు. బీసీ కమిషన్, క్యాబినెట్, అసెంబ్లీ ఆమోదించిన జీవో నంబర్ 26ను కాదనడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని తెలిపారు. ఈ జీవోను తొక్కిపెట్టి ప్లానింగ్ విభాగం ద్వారా కులగణనకు జీవో 18ని విడుదల చేసి మొత్తం వ్యవస్థనే పక్కదారి పట్టించిందని మండిపడ్డారు. గతంలోనే కేసీఆర్ సర్కారు బీసీల ఆర్థిక సామాజికస్థితిగతులను అధ్యయనం చేయడానికి 2021లోనే జీవోనంబర్9 ద్వారా బీసీ కమిషన్ ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. కరోనా సంక్షోభం కారణంగా ఈ కమిషన్ నివేదిక ఆలస్యమైందని తెలిపారు. 2024 జనవరి 29న ఈ కమిషన్ నివేదిక అందించినట్టు చెప్పారు. కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా కులగణన చేపట్టకుండా ప్రభుత్వం బీసీలను మోసం చేస్తున్నదని దుయ్యబట్టారు. జీవో నంబర్ 18 ద్వారా చేసిన సర్వే న్యాయస్థానాల్లో నిలువదని స్పష్టం చేశారు.

అంతా తప్పులతడకే..

ప్రభుత్వం చేసిన కులగణనలో రాష్ట్రంలో 3.70కోట్ల మంది జనాభా మాత్రమే ఉన్నట్టు చెబుతున్నారని, 2014లో చేసిన సమగ్ర కుటుంబ సర్వే ప్రకారమే రాష్ట్ర జనాభా మూడున్నర కోట్ల పై చిలుకు ఉందని గంగుల గుర్తు చేశారు. ప్రతి పదేళ్లకు తెలంగాణలో 13.8శాతం రేషియో చొప్పున జనాభా పెరుగుతుందని కేంద్రం 2011జనాభా లెక్కల సమయంలో తేల్చి చెప్పిందని తెలిపారు. ఆ లెక్కన చూస్తే రాష్ట్ర జనాభా 4.20కోట్ల వరకు ఉంటుందని చెప్పారు. దీనిని చూస్తే ప్రభుత్వం చేసిన సర్వే తప్పులతడక కాక.. మరేంటో చెప్పాలని ప్రశ్నించారు.

రీ సర్వే చేయాల్సిందే..

మరోసారి రీ సర్వే చేపట్టాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తుంటే, మిగిలిపోయిన కుటుంబాలకు మాత్రమే సర్వే చేస్తామని కాంగ్రెస్ చెప్పడం విడ్డూరంగా ఉందని గంగుల అన్నారు. ఇలా అయితే ఇప్పటివరకు చేసిన సర్వే వివరాలు బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఇలా చేస్తే వివరాలు ప్రజలు చూసుకునే వీలుంటుందని చెప్పారు. అవసరమైతే ఇందుకోసం ప్రత్యేక వెబ్‌సైట్ ఏర్పాటు చేసి వివరాలు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 56 నుంచి 66 శాతం ఉన్న బీసీ జనాభాను 46.25శాతానికి తగ్గించడం వెనుక బీసీలపై కాంగ్రెస్‌కు ఉన్న వివక్షను తెలియజేస్తున్నదని విమర్శించారు. మరోసారి శాస్త్రీయంగా కులగణను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, పలువురు మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

కులగణనలో తప్పులను సరిదిద్దాలి

- కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయాలి
- కేసీఆర్ హయాంలోనే బలహీనవర్గాలకు న్యాయం
- రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర

తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ): కులగణనలో తప్పులను సరిదిద్దాలని రాజ్యసభ సభ్యుడు, బీఆర్ఎస్ నేత వద్దిరాజు రవిచంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు 42 శాతం కోటా ఇవ్వాల్సిందేనని, లేదంటే బలహీనవర్గాల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. తెలంగాణభవన్‌లో శుక్రవారం బీసీ కమిషన్ మాజీ సభ్యుడు కిషోర్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు రఘురాం, శ్రీనివాస్, వివేక్ రాజుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే బీసీల జనాభాను తగ్గించి చూపిందని ఆరోపించారు. జనాభాలో 51 శాతం ఉన్న బీసీలకు కార్పొరేషన్ పోస్టుల భర్తీలో తీవ్ర అన్యాయం జరిగిందని చెప్పారు. మంత్రివర్గంలో కేవలం ఇద్దరు బీసీలకు అవకాశం ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మంత్రివర్గ విస్తరణలోనైనా ప్రాధాన్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ హయాంలోనే బీసీలకు సముచిత ప్రాధాన్యం దక్కిందన్నారు. మార్కెట్ కమిటీల నియామకంలో బీసీలకు ప్రత్యేక కోటా కేటాయించిన ఘనత బీఆర్ఎస్ సర్కారుకే దక్కుతుందని అన్నారు. కేసీఆర్ బీసీబంధును తీసుకొచ్చారని పేర్కొన్నారు. కాంగ్రెస్ సర్కారు ఈ స్కీంను అమలు చేయకుండా అటకెక్కించిందని దుయ్యబట్టారు.

ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలి: కిషోర్‌గౌడ్

బీసీలకు 42 శాతం కోటా ఇచ్చిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని బీసీ కమిషన్ మాజీ సభ్యుడు కిషోర్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఇందుకోసం అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. ఇంటింటికీ ఎన్యుమరేటర్లను పంపించి కులగణన రీసర్వే చేయాలని కోరారు. ఎంపీడీవో ఆఫీసులకు వెళ్లి వివరాలు ఇవ్వాలని ప్రజలను ఇబ్బందిపెట్టడం సరికాదన్నారు.

'అసైన్డ్'కు ఎసరు!

మొదటిపేజీ తరువాయి...

మండలాల పరిధిలో మరో 554 ఎకరాల భూమిని సేకరించేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసింది. ఔటర్ రింగురోడ్డు (ఓఆర్ఆర్) నుంచి ప్రతిపాదిత రీజినల్ రింగురోడ్డు (ఆర్ఆర్ఆర్)ను కలిపేందుకు 100 మీటర్ల వెడల్పుగల గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డు కోసం ఈ భూములను సేకరిస్తున్నారు. ఇందులోనూ అధికంగా అసైన్డ్ భూములే ఉన్నాయి. ఆర్ఆర్ వెంట ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఫ్యూచర్ సిటీకి రోడ్డు, మెట్రో రైలు, విమానాశ్రయం కనెక్టివిటీని ఏర్పాటు చేసే పేరుతో పెద్ద ఎత్తున ప్రణాళికలు సిద్ధం చేస్తున్నది. ఈ క్రమంలోనే ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆర్ వరకు విశాలమైన రేడియల్ రోడ్డును రెండు దశల్లో నిర్మిస్తామని ప్రకటించింది. రెండో దశ రోడ్డు నిర్మాణం కోసం ప్రస్తుతం యాచారం మండలంలోని కుర్మిద్ద, కడ్తాల్ మండలం కుడ్తాల్, ముద్విన్ గ్రామాలు, అమనగల్లు మండలం అమనగల్లు, ఆకుతోటపల్లి తదితర గ్రామాల్లో 554.34 ఎకరాలు సేకరించేందుకు నోటిఫికేషన్ విడుదల చేసింది. మీర్‌ఖాన్‌పేట నుంచి అమనగల్లు వరకు సుమారు 20 కిలోమీటర్ల మేర ఇంటర్‌చేంజ్‌లను మినహాయించి 100 మీటర్ల ఆర్ఓడబ్ల్యూ (రైట్ ఆఫ్ వే)తో నేరుగా రోడ్డు నిర్మాణం కోసం భూమి సేకరిస్తున్నట్టు నోటిఫికేషన్‌లో పేర్కొన్నది.

సింహభాగం అసైన్డ్‌భూములే

రేడియల్ రోడ్డు కోసం నోటిపై చేసిన భూముల్లో పట్టా, అసైన్డ్, సీలింగ్, ప్రభుత్వ భూములున్నాయి. ఇందులో 70-80 శాతం అసైన్డ్, ప్రభుత్వ భూములే ఉన్నాయని స్థానిక రైతులు చెప్తున్నారు. వీటికి ఆనుకొని కొందరు పెద్దలకు సంబంధించిన భూములున్నా వాటిని తీసుకోకుండా ఉద్దేశపూర్వకంగా అలైన్‌మెంట్‌ను తమ భూముల నుంచి వెళ్లేలా చేశారని దళిత రైతులు ఆరోపిస్తున్నారు. అలైన్‌మెంట్ రూపొందించడంలో సర్కారు వివక్ష చూపిందని మండిపడుతున్నారు. ఈ భూములకు సంబంధించి రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కొంగరకలాన్‌లో ఉన్న శంషాబాద్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ) కార్యాలయంలో మరిన్ని వివరాలు పొందవచ్చని నోటిఫికేషన్‌లో తెలిపారు. భూసేకరణ చట్టం ప్రకారం భూముల్లోకి ప్రవేశించడం, సర్వే చేయడం, కొలతలు తీసుకోవడం, తవ్వకాలు జరపడం, బోరు వేయడం, ఇతర చర్యలు చేపట్టడానికి సంబంధిత అధికారులకు పూర్తి అధికారం కల్పించినట్టు పేర్కొన్నారు. ఈ భూముల క్రయవిక్రయాలపై నిషేధం విధించారు.

ప్రభుత్వం భూసేకరణ చేపట్టిన కొన్ని ప్రాజెక్టుల వివరాలు

క్ర.సం.	పర్పస్	ఎక్కడ	ఎకరాలు	అసైన్డ్
1.	రేడియల్ రోడ్డు	యాచారం, కడ్తాల్	554.34	ఎక్కువశాతం అమనగల్లు
2.	ఇండస్ట్రియల్ పార్క్	తిమ్మాపూర్	567	మొత్తం
3.	మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్క్	దుద్యాల మండలం	1257	ఎక్కువశాతం
4.	మెడికల్ కాలేజ్	కొడంగల్	60	ఎక్కువ శాతం
5.	ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం	చౌటుప్పల్-సంగారెడ్డి	4942	ఎక్కువశాతం

అన్నిచోట్లా ఇదే తంతు

రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి సర్కారు కొలువుదీరిన తర్వాత చేపట్టిన భూసేకరణ మొత్తం వివాదాస్పదంగానే ఉన్నది. అన్నిచోట్లా ఇదే తంతు కొనసాగుతున్నది. లగచర్లలో (దుద్యాల) ఇండస్ట్రియల్ కారిడార్ కోసం సుమారు 1500 ఎకరాలు సేకరిస్తుండగా, అందులో అత్యధికంగా గిరిజనులు, దళితుల భూములే ఉన్నాయి. గిరిజన రైతుల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురైనా ప్రభుత్వం వెనక్కి తగ్గకుండా భూసేకరణ ప్రక్రియ కొనసాగిస్తున్నది. తొలుత ఫార్మా క్లస్టర్ కోసం భూమి సేకరిస్తామని చెప్పగా తర్వాత రైతుల నుంచి వచ్చిన వ్యతిరేకతతో కొంత వెనక్కి తగ్గింది. ఆ తర్వాత మళ్లీ అక్కడే ఇండస్ట్రియల్ కారిడార్‌ను ప్రభుత్వం ప్రతిపాదించి భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేస్తున్నది. రంగారెడ్డి జిల్లా తిమ్మాపూర్‌లో ఇండస్ట్రియల్ పార్క్ కోసం పూర్తిగా 567 ఎకరాల అసైన్డ్ భూములు సేకరిస్తున్నది. ఇందులో మొత్తం దళితుల భూములే ఉన్నాయి. దీనికి దగ్గరలోనే ప్రైవేట్ వ్యక్తుల భూములున్నా వాటి జోలికి ప్రభుత్వం వెళ్లడంలేదు. ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం అలైన్‌మెంట్‌లో కూడా అసైన్డ్ భూములు భారీగా ఉన్నట్లు సమాచారం. మంచిర్యాలలో పారిశ్రామికవాడ కోసం ప్రస్తుతం హాజీపూర్ మండలం వేంపల్లి, పోచంపాడు గ్రామాల్లో 276 ఎకరాల సేకరణకు ప్రయత్నిస్తుండగా ప్రస్తుతం సర్వే జరుగుతున్నది. ఆ తర్వాత నోటిఫికేషన్ జారీ కానుంది. ఇందులోనూ దళితుల భూములే ఎక్కువ ఉన్నాయని చెప్తున్నారు. వీటిని 2009లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో అసైన్డ్ చేశారు. గత నెలలో కొందరు కాంగ్రెస్ నేతలు ఈ భూములు ఇవ్వాలని బెదిరించి సంతకాలు చేసుకున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. జగిత్యాల జిల్లా భీమారం మండలంలో సూరమ్మ చెరువు కుడికాలువ నిర్మాణంకోసం, భూపాలపల్లిలోని పలిమెలలో సిమెంట్ కంపెనీ కోసం భూసేకరణ చేస్తుండగా, ఈ ప్రాంతాల్లోనూ ఎక్కువగా అసైన్డ్ భూములే ఉన్నట్లు తెలిసింది. అందులోనూ ఎకరం, రెండెకరాలలోపు భూములున్న నిరుపేదలే భూములు కోల్పోతున్నారు.

పట్టా యజమానులతో సమానంగా పరిహారం

ప్రభుత్వం బలవంతంగా భూసేకరణకు దిగడంతో పేదలు ఏమిచేయాలో దిక్కుతోచని పరిస్థితిలో పడ్డారు. భూసేకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్నా ప్రభుత్వం పోలీసులతో ఆందోళనలను అణచివేస్తూ అక్రమ కేసులతో జైళ్లకు పంపుతుండడంతో చాలామంది తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ప్రభుత్వం ఇచ్చే అరకొర నష్ట పరిహారంతో తాము ఎక్కడా భూములు కొనుగోలు చేసుకునే పరిస్థితి లేదని, అందుకే ప్రభుత్వమే భూమికి బదులు భూమి ఇవ్వాలనే డిమాండ్ చేస్తున్నారు. వ్యవసాయం తప్ప వేరే పనులు తమకు రావని, అందుకే తమ జీవనాధారం కోల్పోకుండా చూడాలని కోరుతున్నారు. లగచర్ల, ఆర్ఆర్ఆర్ బాధితులు తమకు భూములకు బదులు భూములు ఇవ్వాలని, లేదంటే బహిరంగ మార్కెట్ ధరలు తమకు ఇవ్వాలని కోరుతున్నారు. ఇక భూ సేకరణలో పట్టా భూములతో సమానంగా అసైన్డ్ భూములకు పరిహారం ఇవ్వాలని నిబంధనలు చెప్తున్నాయి. నిరుడు జనవరిలో హైకోర్టు సైతం ఇదే తీర్పు ఇచ్చింది. అసైనీలకు మార్కెట్ విలువకు సమాన పరిహారం, పట్టా యజమానులతో సమానంగా ఇతర ప్రయోజనాలు కల్పించాలని ఆదేశించింది. సుప్రీంకోర్టు సైతం ఇవే మార్గదర్శకాలు ఇచ్చిందని గుర్తుచేసింది.

భూసేకరణ చట్టం-2013లోని కొన్ని ముఖ్యాంశాలు

- 'ది రైట్ ఆఫ్ ఫెయిర్ కాంపన్సేషన్ అండ్ ట్రాన్స్‌పరెన్సీ ఇన్ ల్యాండ్ ఎక్యుజేషన్, రిహాబిలిటేషన్ అండ్ రిసెటిల్మెంట్ యాక్ట్-2013' న్యాయపరమైన నష్టపరిహారం అందించడంతోపాటు పునరావాసం కల్పించేందుకు ఉద్దేశించింది.
- ప్రభుత్వ, ప్రైవేట్ అవసరాలకు చేసే భూసేకరణలో ప్రభావితమయ్యే కుటుంబాలకు న్యాయపరమైన నష్ట పరిహారం అందించాలి
- భూసేకరణ నోటిఫికేషన్ ఇచ్చాక సోషల్ ఇంపాక్ట్ సర్వే (ఎస్ఐఏ) నిర్వహించాలి. అనంతరం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలి.
- ఎస్ఐఏ సర్వే, ప్రజాభిప్రాయ సేకరణ భూసేకరణకు అనుకూలంగా ఉన్నప్పుడే నష్ట పరిహారం చెల్లించి భూములు సేకరించాలి.
- ప్రజాభిప్రాయ సేకరణ భూసేకరణకు వ్యతిరేకంగా ఉంటే భూసేకరణ సాధ్యంకాదు.
- ప్రభుత్వం బలవంతంగా భూసేకరణ జరిపే అవకాశం లేదు. ఒకవేళ అలాచేస్తే బాధితులు న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చు
- గ్రామీణ ప్రాంతాల్లో మార్కెట్ ధరకు నాలుగు రెట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు రెట్లు అధికంగా నష్ట పరిహారం చెల్లించాలి

2008-డీఎస్సీ బాధితులకు ఉద్యోగాలు

కాంట్రాక్టు పద్ధతిలో నియామకాలు చేపట్టిన ప్రభుత్వం

ఉత్తర్వులు జారీ చేసిన విద్యాశాఖ..

నెలకు రూ.31,040 చెల్లింపు..

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ): డీఎస్సీ-2008 బాధితులకు ప్రభుత్వం కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగాలు కల్పించింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. క్యాబినెట్ సబ్ కమిటీ సూచనల మేరకు, హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులకు అనుగుణంగా 2008 డీఎస్సీలో నష్టపోయిన 1382 మందికి సెకండరీ గ్రేడ్ టీచర్లుగా (ఎస్జీటీ) కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగాలు ఇస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులు శనివారం నుంచి అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభమైన రోజు నుంచి విద్యాసంవత్సరం చివరి రోజు వరకు వీరి సేవలు వినియోగించుకోనున్నట్టు వెల్లడించారు. వేతనం రూ.31,040 చెల్లించనున్నట్టు తెలిపారు. నిరుడు అక్టోబర్‌లో నిర్వహించిన సర్టిఫికెట్ వెరిఫికేషన్ సందర్భంగా అభ్యర్థులు ఇచ్చిన ఆప్షన్ల మేరకు జిల్లాల వారీగా మెరిట్ లిస్ట్‌ను తయారు చేశామని తెలిపారు. హైదరాబాద్ మినహా 32 జిల్లాల్లో కౌన్సిలింగ్ నిర్వహించి, నియామక ఉత్తర్వులు ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్లకు, డీఈవోలకు ఆదేశాలు జారీ చేశారు.

15 ఏండ్లుగా ఎదురుచూపులు..

2008లో నాటి ప్రభుత్వం మెగా డీఎస్సీని ప్రకటించింది. ఎస్జీటీ ఉద్యోగాలకు బీఈడీ, డీఈడీ అభ్యర్థులు అర్హులని పేర్కొంటూ నోటిఫికేషన్ జారీ చేసింది. ఆతర్వాత ఎస్జీటీ పోస్టుల్లో 30% డీఈడీ అభ్యర్థులకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇది చట్ట విరుద్ధమని బీఈడీ అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారు. దీంతో ప్రభుత్వం నోటిఫికేషన్ ప్రకారమే ఫలితాలు విడుదల చేసి.. కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభించింది. డీఈడీ అభ్యర్థులు పరిపాలన ట్రిబ్యునల్‌ను ఆశ్రయించగా, 30% కోటా ఇవ్వాలని ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో కౌన్సెలింగ్ ప్రక్రియ నిలిచిపోయింది. ప్రభుత్వం డీఈడీ అభ్యర్థులకు 30% పోస్టులు కేటాయించి కౌన్సెలింగ్ నిర్వహించింది. దీంతో కామన్‌మెరిట్ లిస్ట్‌లో ఉండి, 30% కోటా వల్ల నష్టపోయిన బీఈడీ అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారు. అప్పటి నుంచి 14 ఏండ్లు కోర్టులు, ప్రభుత్వాల చుట్టూ తిరిగారు. బాధితులకు ఉద్యోగాలు ఇవ్వాలని హైకోర్టు ఫిబ్రవరిలో మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

అదిలాబాద్‌లో రైతు ఆత్మహత్య

మొదటిపేజీ తరువాయి...

సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. పెట్టుబడి కోసం బ్యాంకులో రూ.లక్ష, ఇతరుల వద్ద మరో లక్ష అప్పు చేశాడు. కొన్ని రోజులుగా దిగులుబడి సరిగా రావడం లేదు. అప్పులు ఎలా తీర్చాలన్నా బెంగతో బుధవారం మధ్యాహ్నం పురుగుల మందు తాగి ఇంటికి వచ్చాడు. ఈ విషయం భార్యకు చెప్పడంతో వెంటనే కుటుంబ సభ్యులు ఆదిలాబాద్‌లోని రిమ్స్ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై మహేందర్ తెలిపారు.

నిందితులందరూ కోర్టుకు రావాలి

- ఓటుకు నోటు కేసులో కోర్టు ఆదేశం

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ): ఓటుకు నోటు కేసులో నిందితునిగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మిగిలిన ఐదుగురు నిందితులు ఎగ్జామినేషన్ ప్రక్రియకు తప్పక హాజరుకావాలని నాంపల్లిలోని ఈడీ కోర్టు ఆదేశాలు జారీచేసింది. ఈ కేసులో శుక్రవారం జరిగిన విచారణకు బిషప్ హ్యారీ సెబాస్టియన్, జెరూసలేం మత్తయ్య, సండ్ర వెంకటవీరయ్య కోర్టుకు హాజరయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు రుద్రశివకుమార్ ఉదయ్ సింహా, వేం కృష్ణ కీర్తమ్‌ల తరపున వారి న్యాయవాదులు గైర్హాజరు పిటిషన్లను దాఖలు చేశారు. ఈ పిటిషన్లను పరిగణనలోకి తీసుకున్న కోర్టు వచ్చేనెల వాయిదాకు నిందితులందరూ కోర్టుకు హాజరుకావాలని సూచించింది.

లోకం పోకడ

బీసీ కమిషన్ సిఫారసులు తప్పనిసరి

రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ): విద్యా, ఉద్యోగ రంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించాలంటే బీసీ కమిషన్ సిఫారసులు తప్పనిసరని తెలంగాణ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు పేర్కొన్నారు. నిర్దిష్టమైన ప్రామాణిక పద్ధతులను పాటించకుండా ప్రభుత్వం తొందరపాటు నిర్ణయాలు తీసుకుంటే న్యాయపరమైన వివాదాలు తప్పవని హెచ్చరించారు. ఫలితంగా బీసీలు తీవ్రంగా నష్టపోవాల్సి ఉంటుందని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్దిష్టమైన ప్రామాణిక పద్ధతులను పాటిస్తూ, ఏ సంస్థలు నిర్వర్తించాల్సిన బాధ్యతలను ఆయా సంస్థలకే అప్పగించడం న్యాయసమ్మతమని తెలిపారు. అలా కాకుండా ప్రభుత్వమే స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకుని, అమలు చేసే ప్రయత్నం చేస్తే ఆశించిన ఫలితాలు సాధ్యం కావని అభిప్రాయపడ్డారు. రాజకీయ రిజర్వేషన్ల పెంపునకు సంబంధించి డెడికేటెడ్ కమిషన్, విద్యా, ఉద్యోగ రంగాల రిజర్వేషన్లకు సంబంధించి బీసీ కమిషన్ సిఫారసులు తప్పనిసరి అని తెలిపారు. ఆయా కమిషన్ల సిఫారసులు లేకుండానే ప్రభుత్వమే సొంతంగా నిర్ణయాలు తీసుకుంటే, చట్టాలు చేస్తే న్యాయసమీక్ష ఎదుట అవి చెల్లబోవని, బీహార్ ఉదంతమే అందుకు నిదర్శనమని తెలిపారు. ఇకనైనా ప్రభుత్వం ప్రామాణిక పద్ధతులతో ముందుకు పోవాలని సూచించారు.

బీసీలను మోసం చేసింది కాంగ్రెస్సే

మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ధ్వజం

గోదావరిఖనిలో బీసీ కుల సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం

గోదావరిఖని, ఫిబ్రవరి 14: రాష్ట్రంలో బీసీలను మోసం చేసింది కాంగ్రెస్ పార్టేనని రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ ధ్వజమెత్తారు. అత్యధిక జనాభా కలిగిన బీసీలను అణగదొక్కేందుకే కులగణన సర్వేలో తగ్గించి చూపారని మండిపడ్డారు. గోదావరిఖ